కలెక్టర్ ప్రతీక్‌జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

# అధికారుల ఒత్తిడి సమంజసం కాదు

### విద్యాశాఖ సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్

వికారాబాద్, డిసెంబర్ 24 : సమ్మెలో ఉన్న సమగ్ర శిక్షా ఉద్యోగులపై అధికారుల ఒత్తిడి సమంజసం కాదని, ఒత్తిడి చేస్తే అధికారుల ఇంటి ముందు ఆత్మహత్య చేసుకుంటామని విద్యాశాఖ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వికారాబాద్‌లోని ఆర్డీవో కార్యాలయం వద్ద సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె 19వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 19600 మంది సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు హక్కుల సాధన కోసం గత 19 రోజులుగా సమ్మెలో ఉంటూ న్యాయపరమైన డిమాండ్ల కోసం పోరాటం చేస్తున్నారన్నారు. అందుకుగాను ప్రజాస్వామ్యబద్ధంగా రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ఉన్నతాధికారులు, జిల్లా స్థాయి అధికారులకు సమ్మె నోటీసు కూడా ఇచ్చామని.. అయినప్పటికీ ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో పూర్తి స్థాయిలో సమ్మెలోకి దిగనున్నామని వివరించారు. వికారాబాద్ జిల్లాలో ఉన్న ఆయా మండలాల విద్యాశాఖాధికారులు మానవత్వం మరిచి సీసీలకు, ఎంఐఎస్‌లకు ఫోన్ చేసి భయభ్రాంతులకు, బెదిరింపులకు గురిచేస్తున్నారని.. ఇది ఏ మాత్రం సమంజసం కాదన్నారు. అన్ని మండలాల విద్యాశాఖాధికారులు సమగ్ర శిక్షా ఉద్యోగులకు సహకరించాలని కోరారు. ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో మరో రెండు రోజుల్లో సమగ్ర శిక్షా ఉద్యోగులు ప్రధానంగా కేజీబీవీలో ఉన్న పూర్తి స్థాయి ఉద్యోగులు కూడా సమ్మెకు దిగుతారని పేర్కొన్నారు. మంగళవారం వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, డీఈవో రేణుకాదేవిలను సమగ్ర శిక్షా ఉద్యోగులు కలిసి 27న పూర్తి సమ్మెకు దిగనున్నామని వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఇందుకు అధికారులు సహకరించాలని కోరారు.

# లిక్విడ్ గంజాయి తరలింపు

### నాలుగు లీటర్లు స్వాధీనం.. నలుగురికి రిమాండ్

పట్టుబడిన నిందితులు

పెద్దఅంబర్‌పేట, డిసెంబర్ 24 : హష్ ఆయిల్ (లిక్విడ్ గంజాయి)ని ఒడిశాలో తక్కువ రేటుకు కొని హైదరాబాద్‌లో రెట్టింపు రేటుకు విక్రయించేందుకు తరలిస్తున్న నలుగురు కటకటాలపాలయ్యారు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా కాంవాడాకు చెందిన జయ్‌దేవ్ మల్దార్ అదే రాష్ట్రానికి చెందిన మరో ముగ్గురు జితెంద్ర పంగి, దేవ మాడి, ఆకాశ్ సర్కార్ సాయంతో గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. ఒడిశాలో లీటర్ లిక్విడ్ గంజాయిని రూ.1.2 లక్షలు కొనుగోలు చేస్తూ.. హైదరాబాద్‌లో రూ.3 లక్షల వరకు విక్రయిస్తూ సంపాదిస్తున్నారు. జయ్‌దేవ్ ఒడిశా నుంచి నాలుగు లీటర్ల లిక్విడ్ గంజాయిని భద్రాచలం వరకు తీసుకొచ్చాడు. అక్కడి నుంచి కారులో మరో ముగ్గురితో కలిసి హైదరాబాద్‌కు బయలుదేరారు. పక్కా సమాచారంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు విజయవాడ జాతీయ రహదారిపై మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కమాన్ వద్ద సోమవారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. కారు డిక్కీలో కవర్లలో భద్రపరిచి తరలిస్తున్న నాలుగు లీటర్ల గంజాయిని తెలంగాణ యాంటీ నార్కొటిక్ అధికారులతో కలిసి పట్టుకున్నారు. నగరంలోని వనస్థలిపురానికి చెందిన చిన్నాకు గంజాయి సరఫరా చేస్తున్నట్టు తేల్చారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టినట్టు పోలీసులు తెలిపారు. కారుతోపాటు నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. అనంతరం హయత్‌నగర్‌లోని న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టి రిమాండ్‌కు తరలించినట్టు చెప్పారు. నిందితుడు జయ్‌దేవ్ 2019లో ఒడిశాలోని బలిమెల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి రవాణా చేస్తూ జైలుకు వెళ్లి వచ్చాడు.

# ఒంటరి మహిళ లే టార్గెట్

- అంతర్రాష్ట్ర చైన్ స్నాచింగ్ దొంగను పట్టుకున్న సీపీఎస్ జిల్లా పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నారాయణరెడ్డి

మీడియాతో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, డిసెంబర్ 24 : ఒంటరిగా ఉన్న మహిళలనే టార్గెట్ చేసుకొని మాటల్లో పెట్టి మెడలోని బంగారాన్ని దొంగిలించడం జరుగుతుందని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అంతర్ రాష్ట్ర చైన్ స్నాచింగ్ దొంగను పట్టుకోవడంతో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ వివరాలు తెలియజేశారు. వికారాబాద్ జిల్లాలోని బొంరాస్‌పేటలో సెప్టెంబర్ 20న ఓ మహిళ మెడలోంచి 2.5 తులాల బంగారు గొలుసు స్నాచింగ్ జరిగిందని, కులకచర్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సెప్టెంబర్ 22న దీనికి సంబంధించి ఫిర్యాదు వచ్చిందన్నారు. జిల్లాలో రెండు రోజుల్లోనే 3 స్నాచింగ్ కేసులు నమోదయ్యాయని తెలిపారు. ఈ కేసులను చాలెంజ్‌గా తీసుకొని ఆయా పోలీస్ స్టేషన్ అధికారులు, సీపీఎస్ ఇన్‌స్పెక్టర్ బలవంతయ్య, అన్వర్ పాషా ఆధ్వర్యంలో టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టెక్నికల్ ఆధారాలు, ఆయా పోలీస్ స్టేషన్ల పరిధుల్లో ఏర్పాటు చేసిన సీసీటీవీల ద్వారా సేకరించిన ఆధారాలతో జిల్లాలో చైన్ స్నాచింగ్ చేసిన అంతర్ రాష్ట్ర చైన్ స్నాచింగ్ నేరస్తులు అయిన ఎండి జావిద్, ఒక మైనర్ బాలుడిగా గుర్తించారు. ఇద్దరినీ కర్ణాటక రాష్ట్రం బీర్ జిల్లా, హుమ్నాబాద్ తాలూకాలోని తేజస్ లాడ్జి వద్ద వికారాబాద్ సీసీఎస్ పోలీస్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.



రికవరీ చేసిన బంగారం, ఆయుధాలు

మహిళలు జాగ్రత్తగా ఉండాలని, ఒంటరిగా ఉన్నప్పుడూ తమ దగ్గర ఉన్న బంగారం ఆభరణాలు కనబడకుండా జాగ్రత్తపడాలన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా ఉంటే వెంటనే తమ కుటుంబసభ్యులకు గాని, తమ పరిధిలోని పోలీస్ అధికారులకుగాని తెలియజేయాలన్నారు. డయల్ 100 ద్వారా జిల్లా పోలీస్ అధికారులకు సమాచారమందిస్తే ఎల్లప్పుడూ పోలీస్ అధికారులు జిల్లా ప్రజల కోసం అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కేసును ఛేదించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్లు బలవంతయ్య, అన్వర్‌పాషా, చెన్నయ్యగౌడ్, జయవర్ధన్, శివకుమార్, కృష్ణా రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, అంజప్ప, రామకృష్ణలను ఎస్పీ అభినందించారు.

ఉద్యాన పంటలను పరిశీలిస్తున్న ఒడిశా రాష్ట్ర అధికారులు, రైతులు

## ఉద్యాన పంటల పరిశీలన

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 24 : ఫరూఖ్‌నగర్ మండలంలోని ఉద్యాన పంటలను ఉద్యాన, పట్టు పరిశ్రమలశాఖ ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్ర అధికారులు, రైతులు మంగళవారం పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో ఉద్యానవనంలో సాగవుతున్న పంటలు, సబ్సిడీ, సూక్ష్మ సేద్యం, బిందు సేద్యం వంటి విషయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పంటల నిర్వహణ, మార్కెటింగ్, లభ్యత వనరులు, మామిడి సాగు నిర్వహణ, కూరగాయల పంటలు, టమాట, ఫాంపాండ్ పాలీహౌస్ వంటివాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఉద్యాన పంటలపై శిక్షణా కార్యక్రమంలో భాగంగా ఒడిశా రాష్ట్ర అధికారులు, రైతులు ఉద్యాన పంటలను పరిశీలించడం జరిగిందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమలశాఖ అధికారి నరేశ్ తెలిపారు. పంటల సాగు, పండ్ల నిర్వహణను ప్రత్యక్షంగా తెలుసుకోవడం పట్ల వారు సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు.

ధ్యాన మహాయాగంలో మాట్లాడుతున్న పరిణతి పత్రీ

## సహనం, ఓర్పును పెంపొందించుకోవాలి

### పీఎస్ఎస్ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిణతి పత్రీ

కడ్తాల్, డిసెంబర్ 24 : మనలో ఉన్న సహనం, ఓర్పును మరింత పెంపొందించుకోవాలని.. ఎలాంటి పరిస్థితిలోనైనా ప్రశాంతంగా ఉండాలని పీఎస్ఎస్ఎం గ్లోబల్ వ్యవస్థాపకురాలు పరిణతి పత్రీ అన్నారు. మండల కేంద్రం సమీపంలోని మహేశ్వర మహా పిరమిడ్‌లో జరుగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగం-3 ఉత్సవాలు మంగళవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ప్రాతఃకాల సంగీత ధ్యానంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పిరమిడ్ మాస్టర్లు, ధ్యానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక గురువులు రచించిన పుస్తకాలను ట్రస్ట్ సభ్యులు ఆవిష్కరించారు. ధ్యాన మహాసభలకు పచ్చే ధ్యానులకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం మైత్రేయ కూచిపూడి కళాక్షేత్రం జనగాం కళాకారులు నిర్వహించిన సాంస్కృతి కార్యక్రమాలు ధ్యానులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ధ్యాన మహాయాగంలో కళాకారుల నృత్య ప్రదర్శన

### వినియోగదారులకు న్యాయం చేకూర్చేలా

# అవగాహన కల్పించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, డిసెంబర్ 24 : డిజిటల్ విధానం, వర్చువల్ విచారణ ద్వారా వినియోగదారులకు న్యాయం చేకూర్చేలా అవగాహన కల్పించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లింగ్యానాయక్ మాట్లాడుతూ.. ప్రతి పౌరుడికి వినియోగదారుల హక్కుల గురించి తెలియజేసే దిశగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వినియోగదారుల సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. వినియోగదారుల హక్కులకు ఎటువంటి భంగం కలుగకుండా, వారికి న్యాయం చేకూర్చే దిశగా అధికారులు పని చేయాలని ఆదేశించారు. వినియోగదారులకు జాతీయ వినియోగదారుల దినోత్సవంపై అవగాహన కల్పిస్తూనే వారి ఉద్దేశాలను, సూచనలు, సలహాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, ఎస్సిడబ్ల్యూడీవో మల్లేశం, తూనికలు కొలతల శాఖ జిల్లా అధికారి రియాజ్, చౌక ధరల దుకాణాల సంఘం జిల్లా అధ్యక్షుడు జూకారెడ్డి, గ్యాస్ ఏజెన్సీ డీలర్లు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు, డీలర్లు

### రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు

## ముజాహిద్‌పూర్ పాఠశాల విద్యార్థినులు

దోమ, డిసెంబర్ 24 : కులకచర్ల మండల పరిధిలోని ముజాహిద్‌పూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీఎం కప్ వికారాబాద్ జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో మూడు వేల మీటర్ల రన్నింగ్ క్రీడా విభాగంలో పాఠశాలకు చెందిన మనీషా ప్రథమ స్థానం, నందిని రెండో స్థానం కైవసం చేసుకోగా, ఎనిమిది వందల మీటర్ల రన్నింగ్ పోటీలో సైతం అంకిత ప్రథమ స్థానం, గాయత్రి రెండో స్థానంలో నిలువగా వారికి జిల్లా స్థాయి పథకాలను అందజేసినట్లు పాఠశాల హెచ్ఎం జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 31న హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు మనీషా, అంకిత ఎంపికైనట్లు పాఠశాల పీడీ వెంకటేశ్వర్లు, హెచ్ఎం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

తొలుకట్టాలోని ప్రభుత్వ భూమిలో వేసిన ప్రీకాస్టును తొలగిస్తున్న సిబ్బంది

# ప్రీకాస్టు తొలగింపు

- సుమారు రూ.25 కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం
- కబ్జా చేసిన వ్యక్తిపై క్రిమినల్ కేసులు పెట్టిస్తాం
- తహసీల్దార్ గౌతంకుమార్

మొయినాబాద్, డిసెంబర్ 24 : మండల పరిధిలోని తోలుకట్టా గ్రామ రెవెన్యూలోని సర్వే నం.108లో 11 ఎకరాల భూమిని కబ్జా చేశారని గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం రెవెన్యూ అధికారులు 5 ఎకరాలు కబ్జాకు గురైందని గుర్తించి 5 ఎకరాలకు వేసిన ప్రీకాస్టును తొలగించారు. ఆర్ఐ సుర్జిత్‌కుమార్‌రెడ్డి తమ సిబ్బందితో వెళ్లి జేసీబీల సహాయంతో కబ్జా చేసిన ప్రభుత్వ భూమికి ఉన్న ప్రీకాస్టును ధ్వంసం చేశారు. అందులో ఉన్న తాత్కాలిక నిర్మాణాలను సైతం తొలగించారు. సుమారు రూ.25 కోట్ల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గౌతంకుమార్ మాట్లాడుతూ.. 5 ఎకరాల ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేసిన వ్యక్తిపై క్రిమినల్ కేసు పెట్టడం జరుగుతుందన్నారు. ఎవరైనా సరే ప్రభుత్వ భూములను అక్రమంగా కబ్జా చేస్తే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంతటివారైనా సరే ప్రభుత్వ భూముల జోలికి వస్తే ఉపేక్షించేది లేదన్నారు. మొయినాబాద్ మండలం హైదరాబాద్ మహా నగరానికి అతి సమీపంలో ఉండటంతో ఇక్కడి భూములు చాలా విలువైనవని, ప్రభుత్వ భూముల పక్కన పట్టా భూములు కొనుగోలు చేసి పక్కనే ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసినా, లావణి భూములను నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసినా తిరిగి స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా ప్రభుత్వ భూములను కబ్జా చేసినా, కబ్జాకు యత్నించినా రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు సమాచారమివ్వాలని సూచించారు.

## ఫార్మాసిటీ మలిదశ ఉద్యమానికి సిద్ధం కావాలి

### ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ సమన్వయకర్త కవుల సరస్వతి

యాచారం, డిసెంబర్ 24 : ఫార్మాసిటీని వ్యతిరేకిస్తూ మలిదశ ఉద్యమానికి రైతులు సిద్ధం కావాలని ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ సమన్వయకర్త కవుల సరస్వతి పిలుపునిచ్చారు. ఫార్మాసిటీ భూసేకరణలో భాగంగా కోర్టు స్టే ఉన్న భూములను వెంటనే ఆన్‌లైన్‌లో ఎక్కించాలని కోరుతూ ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్, ఇబ్రహీంపట్నం ఆర్డీవో, యాచారం తహసీల్దార్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడుతూ.. కోర్టు స్టే ఉన్న భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించి, రైతు బంధు, మ్యుటేషన్ తదితర సదుపాయాలను కల్పించాలని గతంలోనే హైకోర్టు తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కోర్టు ఆదేశాలను బేఖాతరు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులు ఎన్నిసార్లు కార్యాలయాల చుట్టూ తిరిగి అధికారులతో మొరపెట్టుకుంటే టెక్నికల్ సమస్యలతో చేయలేకపోతున్నామని చెప్పి చేతులు దులుపుకోవడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం కావాలనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసి అనంతరం రైతుల నుంచి భూములను లాక్కోవాలని చూస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు స్టే తెచ్చుకున్న రైతుల భూములను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, రైతు బంధు, రైతు బీమా, మ్యుటేషన్, పంట రుణాలు తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఫార్మాసిటీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును దృష్టిలో ఉంచుకొని ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో త్వరలో రైతులతో కలిసి ఫార్మాసిటీకి వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టనున్నట్లు ఆమె స్పష్టం చేశారు.

మాట్లాడుతున్న కవుల సరస్వతి

## పత్తి కొనుగోలు కేంద్రాలు మూసివేత

వికారాబాద్, డిసెంబర్ 24 : బుధ, గురువారాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలను మూసివేయడం జరుగుతుందని జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న క్రిస్మస్ పండుగ ఉందని, అదేవిధంగా 26న అన్ని కాటన్ మిల్లుల్లో స్టాక్స్ ఎక్కువగా ఉన్నందున సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు నిలిపివేయడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని ఆయన సూచించారు.

చైతన్యపురి డివిజన్‌లోని కాలనీలవాసులు బీఆర్ఎస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో తమ సమస్యలను ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వివరించగా పరిష్కరిస్తానని చెప్పారు. - ఎల్బీనగర్, డిసెంబర్ 24

రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ గద్దర్ వెన్నెలను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానిస్తున్న మాల మహానాడు నాయకులు - పరిగి, డిసెంబర్ 24

# గ్రేటర్‌లో మరో 40 చోట్ల చార్జింగ్ పాయింట్లు

### ఇప్పటికే 43 ప్రాంతాల్లో అందుబాటులోకి..

సిటీబ్యూరో, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : బహిరంగ ప్రదేశాల్లో ఈ-వాహనాల కోసం చార్జింగ్ పాయింట్ల ఏర్పాటుకు జీహెచ్ఎంసీ కసరత్తు చేస్తున్నది. వాహన కాలుష్యాన్ని తగ్గించడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నది. ఇందులో భాగంగానే ఎలక్ట్రిక్ వాహనదారులకు చార్జింగ్ సమస్య లేకుండా తక్కువ ధరతో ఈ-చార్జింగ్ కేంద్రాలు నగర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్నారు. ఈ చార్జింగ్ స్టేషన్ తక్కువ ధరతో తొందరగా చార్జింగ్ అయ్యేందుకు ఎక్కువ యూనిట్ యంత్రాలను అనువైన స్థలాన్ని ఎంపిక చేసి ఈ మేరకు గ్రేటర్ వ్యాప్తంగా రెడ్ కో సహకారంతో యూనిట్‌కు ఒక రూపాయి కమీషన్‌కు జీహెచ్ఎంసీ ఒప్పందం చేసుకుంది. గ్రేటర్‌లో ఈవీ కార్ల సంఖ్య దాదాపు 5వేల వరకు ఉన్నట్లు అంచనా వేసిన అధికారులు.. అందుకు అనుగుణంగా చార్జింగ్ పాయింట్లు పెంచుతున్నారు. ఇప్పటికే 43 ప్రాంతాల్లో అమలు అవుతుండగా, తాజాగా మరో 40 చోట్ల చార్జింగ్ పాయింట్లను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు జీహెచ్ఎంసీ

ఏర్పాట్లు చేస్తున్నది.

### మొత్తం 150 ప్రాంతాల్లో..

గ్రేటర్‌లో 150 చోట్ల ఎలక్ట్రిక్ వెహికల్ చార్జింగ్ స్టేషన్‌ల ఏర్పాటుకు టీజీ రెడ్‌కో తో ఒక రూపాయి కమీషన్ చొప్పున బల్దియా ఆదాయ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నది. టీజీ రెడ్‌కో ఇప్పటి వరకు 83 ప్రాంతాల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఇన్‌స్టాల్ చేసింది. వాటిలో 43 చార్జింగ్ స్టేషన్లు పలు ప్రాంతాల్లో కమీషన్ చేశారు. మిగిలిన మరో 40 చోట్ల కమీషన్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా జీహెచ్ఎంసీ పరిధిలో ఒక్క యూనిట్‌కు రూ.15.34 రూపాయలు కాగా, ప్రైవేట్ చార్జింగ్ స్టేషన్‌లో రూ.23.6ల నుంచి 35.4 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. జీహెచ్ఎంసీ పరిధిలో ఏర్పాటు చేసిన చార్జింగ్ స్టేషన్‌లు తక్కువ రేటుతో పాటు కేవలం 40 నిమిషాల్లో చార్జింగ్ ప్రక్రియ పూర్తవుతుంది. ఒక్కొక్క చార్జింగ్ స్టేషన్ 60 కిలో వాట్ల కెపాసిటీ కలిగి ఉంది. ఒక్కొక్క కారు కెపాసిటీ 20 యూనిట్లు కాగా 30 నిమిషాల్లో కారు చార్జింగ్ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. ఈ చార్జింగ్ వాహనాలకు చార్జింగ్ సమస్య ఉండకూడదనే ఉద్దేశంతో ఈ పాయింట్లు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, బల్దియా సెంటర్ల వద్ద యూనిట్‌కు రూ. 13తో పాటు 18శాతం జీఎస్టీ కలిపి రూ. 15.34 వరకు, అదే ప్రైవేట్‌లో మాత్రం రూ. 20 నుంచి రూ.25ల వరకు (18 శాతం జీఎస్టీ అదనంతో) వసూలు చేస్తున్నారు.

## రైతుల వినతిపై చట్టప్రకారం నిర్ణయం తీసుకోండి

### పవర్ గ్రిడ్ బీదర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్‌కు హైకోర్టు ఉత్తర్వులు

హైదరాబాద్, డిసెంబర్ 24, నమస్తే తెలంగాణ : రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మక్తా మాదారం గ్రామంలోని సర్వే నం.35, 36, 37ల్లో విద్యుత్తు సరఫరా లైన్‌ల ఏర్పాటుపై రైతుల వినతిపై చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని పవర్ గ్రిడ్ బీదర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్‌కు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. రైతులు వారంలోగా వినతిపత్రం సమర్పించాలని.. దానిపై తగిన నిర్ణయం తీసుకోవాలని పవర్ గ్రిడ్ సంస్థకు ఆదేశాలు జారీ చేసింది. ట్రాన్స్‌మిషన్ లైన్‌ల ఏర్పాటుపై తాము డిసెంబర్ 10న సమర్పించిన వినతిపత్రంపై పవర్ గ్రిడ్ బీదర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ స్పందించకపోవడంతో జి.శ్రీనివాసులు తదితర రైతులు వేసిన పిటిషన్‌పై సింగిల్ జడ్జి విచారించింది.

కేంద్ర మార్గదర్శకాల ప్రకారం రైతులకు తగిన పరిహారం చెల్లించి లైన్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీన్ని సవాలు చేస్తూ రైతులు దాఖలు చేసిన అప్పీలుపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాసరావులతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పవర్ గ్రిడ్ బీదర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ రైతులు తాజాగా వినతిపత్రం సమర్పిస్తే చట్టప్రకారం తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం వారంలోగా రైతులు వినతిపత్రాన్ని సమర్పించాలని, దీనిపై కేంద్రం మార్గదర్శకాల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని పవర్ గ్రిడ్ బీదర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్‌ను ఆదేశించింది. విద్యుత్తు లైన్‌ల ఏర్పాటుపై అభ్యంతరాలుంటే పవర్ గ్రిడ్ బీదర్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్‌కు వివరించాలంటూ అప్పీలుపై విచారణను ముగించింది.

# ట్రై కమిషనరేట్లలో పెరిగిన క్రైమ్ రేట్

### వార్షిక నివేదిక విడుదల చేసిన సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

సిటీబ్యూరో, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో భారీగా నేరాలు పెరిగాయి. హైదరాబాద్‌లో 41%, సైబరాబాద్‌లో 64%, రాచకొండలో 4% నేరాలు పెరిగాయి. ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక శాంతిభద్రతలు అదుపు తప్పుతున్నాయి. నేరాలు పెరిగాయి. ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో నేరాలు పెరుగుతుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరుసగా ఆయా కమిషనరేట్ల పోలీసులు 2024 వార్షిక నివేదికను విడుదల చేశారు. ఇందులో నేరాలు పెరిగినట్లు స్పష్టంగా కనిపిస్తున్నది. గత బీఆర్ఎస్ హయాంలో శాంతి భద్రతలకు పెద్దపీట వేసిన అప్పటి ప్రభుత్వం.. హైదరాబాద్‌లో నేరాలను ఎక్కడికక్కడే అడ్డుకట్ట వేసింది. పటిష్ట మైన శాంతి భద్రతలతో సురక్షితమైన నగరంగా హైదరాబాద్ రూపుదిద్దుకున్నది. అయితే కాంగ్రెస్ సర్కారు వచ్చాక.. క్షేత్ర స్థాయిలో పోలీసింగ్ పూర్తిగా గాలికొదిలేశారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులన్నింటిపై కేసులు నమోదు చేయడంతోనే క్రైమ్ రేటు పెరిగిందనే వాదనను ఆయా పోలీస్ కమిషనర్లు వినిపిస్తున్నారు. కానీ హత్యలు, లైంగిక దాడులు, దొంగతనాలు, ఆర్థిక నేరాలు అన్ని పెరగడం ప్రజలను తీవ్ర భయాందోళనలను కలిగిస్తున్నది.

### సైబరాబాద్‌లో పెరిగిన నేరాలు

మంగళవారం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి గచ్చిబౌలిలోని కమిషనరేట్ కార్యాలయంలో 2024 వార్షిక నివేదికను విడుదల చేశారు. సాధారణ నేరాల్లో 64 శాతం పెరుగదల కనిపించగా, సైబర్‌నేరాల్లో 164 శాతం పెరిగాయి. డ్రగ్స్ నియంత్రణప